క్లుప్తంగా

ఇంటింటికీ అక్షింతల పంపిణీ


అయోధ్య నుంచి వచ్చిన అంక్షితలను చూపుతున్న వెంకటపతిపాలెం మహిళలు

పరవాడ: అయోధ్యలో ఈ నెల 22న బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను నాయుడుపాలెంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. రామ జన్మభూమి ఫోటో, అక్షింతలు, ఆహ్వాన పత్రాన్ని భక్తులకు అందజేశారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను మనం సిద్ధం చేసిన అక్షింతల్లో కలుపుకోవడం ద్వారా సిద్ధం చేసిన అక్షింతలు పవిత్రం అవుతాయన్నారు. అక్షింతలను ఇంట్లో అందరు వేసుకోవాలని భక్తులకు సూచించారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేషంగా అభిషేకాలు


అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో వేంజేసిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం వరకు భక్తులు ఆలయానికి తరలివచ్చారు. స్వామివారి సన్నిధి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. క్షీరాభిషేకం చేసి భక్తిశ్రద్ధలతో స్వామిని కొలిచారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

కల్యాణం.. కమనీయం


అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయ దాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

నేడు పింఛన్ల పంపిణీ

పరవాడ: వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బుధవారం వెన్నలపాలెం కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రారంభిస్తారని మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త పింఛన్లు కూడా అందజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చివిజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు కోన కోరారు.

పండ్లు, ఔషధ మొక్కలు నాటండి


మొక్క నాటుతున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: పండ్లు, ఔషధ మొక్కలను విరివిగా నాటాలని ఏయూ సోషల్ వర్క్ విభాగాధిపతి ఆచార్య ఎస్.హరనాథ్ కోరారు. గ్రీన్ క్లైమేట్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ఏయూ సోషల్ వర్క్ విభాగంలో మొక్కలు నాటారు. విద్యార్థులను భాగస్వాములను చేస్తూ విరివిగా మొక్కలను నాటాలని హరనాథ్ విజ్ఞప్తి చేశారు. విద్యార్థులంతా పర్యావరణ పరిరక్షణ దిశగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యరంగానికి పెద్దపీట

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- బంగారమ్మపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన


బంగారమ్మపాలెంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


జగనన్న ఆరోగ్య సురక్ష కిట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని బంగారమ్మపాలెం ఎంపీపీ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్య,వైద్యానికి పెద్దపీట వేస్తుందన్నారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ వైద్యానికి దూరం కాకూడదన్న లక్ష్యంతో ఈ కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారన్నారు. గ్రామాల్లోనే వైద్య పరీక్షలు నిర్వహించి జబ్బులను గుర్తిస్తారన్నారు. అవసరమైన వారిని ఉన్నత వైద్యం కోసం పెద్ద ఆస్పత్రులకు పంపించడం జరుగుతుందన్నారు. వైద్య శిబిరంలో అందిస్తున్న సేవలను పరిశీలించారు. శిబిరానికి వచ్చిన గ్రామస్తులను సేవలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న పలువురికి ఆయన కళ్ల జోళ్లు అందజేశారు.

352 మందికి సేవలు

బంగారమ్మపాలెం సచివాలయం పరిధిలోని బంగారమ్మపాలెం,రాయపుర అగ్రహారం,ఎ. శిరసపల్లి,నల్లరేగులపాలెం గ్రామాల నుంచి వచ్చిన సుమారు 352 మందికి వైద్య శిబిరంలో సేవలందించారు. వీరిలో ఐదుగురిని ఉన్నత వైద్యం కోసం అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. 82 మందికి కళ్ల జోళ్లు అవసరమని గుర్తించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీడీవో రమేష్ నాయుడు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ప్రతినిధి కొటాన రాము,పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, రాయపుర అగ్రహారం సర్పంచ్ పిల్లల అప్పలనాయుడు, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు,కాపుశెట్టి శేషుబాబు,పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, ప్రోగ్రాం ఆఫీసర్ కిశోర్ కుమార్,డాక్టర్ ఎస్ఎన్ చక్రవర్తి,డాక్టర్ సీహెచ్ ఆశ,స్పెషలిస్ట్ డాక్టర్ సుజాత,స్థానిక నాయకులు దాడి కన్నంనాయుడు,భీశెట్టి వెంకటరావు,సూరిశెట్టి రాము,దొడ్డి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సేవలు బాగున్నాయి



నాకు 71 సంవత్సరాలు. కాళ్లు రావడం లేదు,ముడుకులు నొప్పులు అధికంగా ఉన్నాయి.దీంతో వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నాను.పరీక్షలు నిర్వహించిన అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. కంటి పరీక్షలు నిర్వహించి కళ్ల జోళ్లు రాశారు. ఐదురోజుల్లో కళ్ల జోళ్లు అందజేస్తామని డాక్టర్‌లు తెలిపారు. చాలా సంతోషంగా ఉంది.

– సూరిశెట్టి అప్పారావు, బంగారమ్మపాలెం.

బీపీ, సుగర్ పరీక్షలు చేశారు



నా వయస్సు 65 సంవత్సరాలు. వైద్య శిబిరంలో బీపీ, సుగర్‌తో పాటు రక్త పరీక్షలు నిర్వహించారు. దగ్గు ఉందని చెబితే పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అంజేశారు. కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్ల జోళ్లు అందజేశారు. గ్రామంలో సేవలు అందించడం వల్ల మాలాంటి వృద్ధులకు మేలు జరుగుతుంది.

– దొడ్డి సూరితల్లి, బంగారమ్మపాలెం

వెంకటాద్రిపై ఘనంగా ధనుర్మాసోత్సవాలు


అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం, స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం తిరుప్పావై సేవా కాలం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి సన్నిధిలో విశేష పూజలు జరిపారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

నూకరాజుకు ఎమ్మెల్యే పరామర్శ


నూకరాజును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అదీప్ రాజ్ తదితరులు

సబ్బవరం: మండలంలోని బంగారమ్మపాలెంలో కొబ్బరి చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు పడి గాయాలైన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోరుబిల్లి నూకరాజును మంగళవారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పరామర్శించారు. ఆయనతో పాటు కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ బోకం సూర్యకుమారి, పార్టీ నియోజకవర్గ ప్రతినిధి కొటాన రాము, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, సబ్బవరపు ముత్యాలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, యడ్ల నాయుడు, ఐడీ బాబు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా కన్వెన్షన్ సెంటర్ పనుల పరిశీలన


కన్వెన్షన్ సెంటర్ పనులను పరిశీలించిన కార్పొరేటర్ ముమ్మన

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లి ప్రాంతంలో రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి నిధులతో నిర్మిస్తున్న కన్వెన్షన్ సెంటర్ పనులను వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు మంగళవారం పరిశీలించారు. కన్వెన్షన్ సెంటర్ రెండో ఫ్లోర్ శ్లాబ్ రాడ్ బెండింగ్ పనులను పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వుడా డీఈ సుధీర్,ఏఈ ఏం శ్రీనివాసరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి చిప్పల చందు, బొడ్డు దేముడు బాబు, కంచిబోయిన సంతోష్,గంట్ల నరసింహమూర్తి, పువ్వాడ త్రినాథ్,గోపాల్,భాగ్యలక్ష్మి, రమణమ్మ తదితరులు ఉన్నారు.

మన కోసం.. మనతో..

- ఏయూ వేదికగా విస్తృతంగా స్టూడెంట్స్ క్లబ్స్ సేవలు
- సాంకేతికత నుంచి సాంస్కృతికం వరకు నిర్వహణ
- మార్గదర్శకత్వం అందించి నడిపిస్తున్న ఆ-హబ్


కోడియం సభ్యులు

ఏయూ క్యాంపస్: నేటి తరం విద్యార్థులు తరగతి గదికి, పుస్తకాలకు మాత్రమే పరిమితం కావడం లేదు. వారిచుట్టూ ఉన్న సమాజాన్ని ఆకళింపు చేసుకుంటున్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తమను తాము మలుచుకుంటున్నారు. ఈ ప్రక్రియలో అవసరమైన నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించుకోవడానికి కళాశాలలో స్టూడెంట్ క్లబ్స్ ఏర్పడుతున్నాయి. ఒక్కో ప్రత్యేక అంశాన్ని ఎంపిక చేసుకుని వారు తమ సహచర విద్యార్థులను నిష్ణాతులుగా మలిచే ప్రయత్నం చేస్తున్నారు. విద్యార్థులంతా తమ కోసం.. తామే అన్నీ అయి వీటిని నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఏర్పాటైన ఇంక్యుబేషన్, స్టార్టప్ కేంద్రం ఆ-హబ్ వీరికి అవసరమైన మార్గదర్శకం అందిస్తూ ముందుకు నడిపించడం మరో విశేషం. గత నాలుగు సంవత్సరాల కాలంలో ఏయూలో 8 విద్యార్థి క్లబ్‌లు ఏర్పాటు అయ్యాయి. ఇవి ఎంతో ప్రభావంతంగా పనిచేస్తున్నాయి. వీటిపై ఓ లుక్కేద్దాం..

ఏయూ యునైటెడ్

విద్యార్థులందరినీ ఐక్యం చేసే విధంగా ఏయూ యునైటెడ్ పనిచేస్తోంది. కాలేజ్ కల్చరల్ ఫెస్ట్‌లు, టెక్నికల్ ఫెస్ట్‌ల నిర్వహణ బాధ్యత ఈ సభ్యులు చేపడతారు. ఆర్ట్స్, క్రాఫ్ట్స్, గేమ్స్, క్రీడలు, ఫొటోగ్రఫీ వంటివి మిళితం చేస్తూ వర్క్‌షాప్‌లు, సెమినార్‌లు, మ్యూజిక్, డ్యాన్స్ ఈవెంట్‌లు ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నారు.

జీడీఎస్

గూగుల్ సాంకేతికతలను విద్యార్థులకు పరిచయం చేయడం లక్ష్యంగా 400 మందికి పైగా సభ్యులు పని చేస్తున్నారు. వర్క్‌షాప్‌లు, వెబ్ డెవలప్‌మెంట్, ఎంఎల్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీతో పాటు అధునాతన ఫ్లటర్ టెక్నాలజీలను సైతం విద్యార్థులకు పరిచయం చేసే దిశగా కృషి చేస్తున్నారు.

హల్ట్ ప్రైజ్ బృందం

సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సహాయంతో ప్రపంచ వ్యాప్తంగా ఎదురయ్యే ముఖ్యమైన సవాళ్లకు పరిష్కారం చూపే యువతను ప్రోత్సహించే విధంగా హల్ట్ ప్రైజ్ నిలుస్తుంది. దీనికి అవసరమైన మార్గదర్శకం అందించే విధంగా విద్యార్థుల బృందం పని చేస్తోంది.

కోడియం... కోడ్ ఐ యామ్....

ప్రారంభించిన కొద్ది రోజుల్లోనే ఈ క్లబ్‌లో 850 మంది సభ్యులుగా చేరారు. విద్యార్థుల్లో కోడింగ్ పట్ల ఆసక్తి, సామర్థ్యాలను పెంచడం లక్ష్యంగా కోడియం పని చేస్తోంది. క్యాంపస్‌లో, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే హ్యాక్‌థాన్‌లో ఏయూ విద్యార్థులను ప్రోత్సహించడం, మార్గదర్శకం అందించడం లక్ష్యంగా కృషి చేస్తోంది. సైబర్ సెక్యూరిటీ, ఐవోటీ, డ్రోన్ టెక్నాలజీ, వెబ్, యాప్ డెవలప్‌మెంట్, ఏఆర్, వీఆర్ వంటి అంశాలలో పని చేస్తున్నారు. ప్రతి వారం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కోడింగ్‌పై సదస్సులను నిర్వహిస్తున్నారు. నిపుణుల జ్ఞానాన్ని పంచుకోవడం, మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన సాంకేతికతలపై అవగాహన కల్పిస్తున్నారు.

బిజ్ హబ్..

ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో చదువుతున్న విద్యార్థులు బిజ్ హబ్ క్లబ్‌ని స్థాపించారు. దీనిలో 300 మందికి పైగా విద్యార్థులు సభ్యులుగా ఉన్నారు. విద్యార్థులను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం, స్టార్టప్‌ల సంఖ్య పెంచడం లక్ష్యంగా పనిచేస్తోంది. ఇప్పటికే విద్యార్థులను భాగస్వాములను చేస్తూ పలు కార్యక్రమాలను నిర్వహించి తమదైన ముద్ర వేసుకున్నారు.

మ్యాథ్స్ క్లబ్.. పయనీర్స్ క్లబ్..

ఇంజినీరింగ్ విద్యార్థులకు మ్యాథ్స్ ఒక బ్రహ్మ పదార్థంగా ఉండటం సహజం. అదే విధంగా కోడింగ్ ఎంతో అవసరం. కోడింగ్‌లో ప్రతిభ చూపాలంటే మ్యాథ్‌మెటిక్స్ స్కిల్స్ ఎంతో అవసరం. విద్యార్థుల్లో గణితం పట్ల భయాన్ని తొలగించడం, గణితాన్ని ఒక ఆటగా మార్చడం లక్ష్యంగా ఈ క్లబ్ పనిచేస్తోంది. దీనిలో 400 మందికి పైగా సభ్యులు ఉన్నారు. ట్రెజర్ హంట్, వర్క్‌షాప్‌లు వంటివి నిర్వహించారు. త్వరలో అంతర్జాతీయ గణిత సదస్సును నిర్వహించడానికి సిద్ధమవుతున్నారు.

ఈ-4 క్లబ్...

ఎంగేజ్, ఎంతూస్, ఎమర్జ్, ఎవాల్వ్ అనే నినాదంతో విద్యార్థులను ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ దిశగా నడిపించడానికి ఈ-4 క్లబ్ పనిచేస్తోంది. ఈ క్లబ్‌లో 360 మంది సభ్యులు ఉన్నారు. ఆలోచనల నుంచి వ్యాపార సంస్థల దిశగా నడిపించడానికి వీరంతా పని చేస్తున్నారు. డిజైన్ థింకింగ్‌పై వర్క్‌షాప్, ఐడియాథాన్‌లు ప్రతి నెలా నిర్వహిస్తున్నారు. ప్రతి నెలా మూడు కార్యక్రమాల నిర్వహణ లక్ష్యంగా క్లబ్ పనిచేస్తోంది.

ఆటలతో ఆంగ్ల భాషపై ప్రావీణ్యం

ఇన్ఫోటైనమెంట్, ఎంటర్‌టైన్‌మెంట్ ప్రధానంగా ప్రతి రెండు వారాలకు ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇంగ్లిష్ లిటరేచర్, స్టోరీస్ వంటి కార్యక్రమాలు ఈ క్లబ్‌లో ప్రదర్శిస్తున్నారు. ప్రత్యేక అంశాలపై డిబేట్‌లు, ట్రెజర్ హంట్, పజిల్స్ సాల్వ్ చేయడంతో పాటు ఆటలతో ఆంగ్ల భాష ప్రావీణ్యం పెంచే ప్రయత్నం చేస్తున్నారు.


కమ్యూనికాన్ సభ్యులు

హక్కులపై అవగాహనతోనే మహిళలకు రక్షణ


దుర్గాబాయి దేశ్‌ముఖ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

ఏయూ క్యాంపస్: రాజ్యాంగం కల్పించిన హక్కులపై పూర్తిస్థాయిలో అవగాహన ఉన్నప్పుడే మహిళల రక్షణ సాధ్యపడుతుందని ఏయూ ఆర్ట్స్, కామర్స్ ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు అన్నారు. మంగళవారం మహారాణిపేట మహిళా అతిథి గృహంలో డాక్టర్ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా అధ్యయన కేంద్రం, వుమెన్ గ్రీవెన్స్ సెల్, ఐసీసీ అంతర్గత ఫిర్యాదు కేంద్రం సంయుక్తంగా మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సును ఆయన ప్రారంభించారు. ముందుగా దుర్గాబాయి దేశముఖ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మహిళలకు విద్య ఎంతో అవసరమని, తద్వారా మహిళా సాధికారత సాధ్యపడుతుందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ముందుండి పోరాటాన్ని నడిపించిన దుర్గాబాయి దేశ్‌ముఖ్ జీవితం నుంచి స్ఫూర్తిని పొందాలన్నారు.

మహిళా అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య ఎ.పల్లవి మాట్లాడుతూ 1987లో ప్రారంభించిన ఈ కేంద్రం మహిళల ప్రగతికి ఎంతగానో కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకుంటూ ప్రతిభతో రాణించాలన్నారు.

దిశ మహిళా పోలీస్ స్టేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు మాధవి గణపతి మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్‌కు ఎక్కువ సమయం వెచ్చించకుండా చదువుపై దృష్టిసారించాలన్నారు. ఏయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి మాట్లాడుతూ దిశ చట్టం వల్ల మహిళలకు ఉపయోగాలు, సమస్యలు వచ్చిన సందర్భంలో స్పందించే విధానం వివరించారు. ఈ కార్యక్రమంలో సైన్స్, ఆర్ట్స్ కళాశాలలకు చెందిన పీజీ విద్యార్థులు 500 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ గేటు వద్ద బంగారు చైను లభ్యం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు (పీపీ గేటు) వద్ద బంగారు చైను లభ్యమైంది. సరైన రుజువులతో వస్తే దానిని యజమానికి అప్పగిస్తామని స్టీల్‌ప్లాంట్ పోలీసులు తెలిపారు. వివరాలివి.. గత నెల 14న 'ఎ' షిఫ్ట్‌లో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ ఎం.కె.అజిత మెయి న్ గేటు వద్ద ద్విచక్ర వాహనాల ఐడీ తనిఖీ విధులు నిర్వర్తిస్తుండగా.. ఉదయం 10.30 గంటల సమయంలో గేటు సమీపంలో బంగారు చైను పడి ఉండటాన్ని గమనించారు. ఆమె తమ ఉన్నతాధికారులకు తెలియజేయడంతో వారు ఉక్కు అధికారులకు సమాచారం ఇచ్చారు. గత నెల 17 వరకు గొలుసు కోసం ఎవరూ రాకపోవడంతో స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌కు అందజేశారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు చైను నాణ్యత తనిఖీ చేయించగా చేయగా 14.730 గ్రాముల బరువు ఉందని, రూ.80 వేలు విలు వ ఉంటుందని ధ్రువీకరించారు. సదరు చైను పోగొట్టుకున్నవారు సరైన ఆధారాలు చూపిస్తే, వారికి అందజేస్తామని హెడ్ కానిస్టేబుల్ మంగతాయారు తెలిపారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల 20వ రోజు మంగళవారం అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

అష్టదళ పద్మారాధన..

108 స్వర్ణపుష్పాలతో కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన జరిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్‌కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 2 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నాదస్వర కచేరీ నిర్వహించారు. కళాకారులు పలు కీర్తనలు ఆలపించారు.

కార్మికుల పోరాటానికి కేంద్రం తలవంచాల్సిందే..


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం కార్మిక వర్గం చేస్తున్న పోరాటానికి కేంద్ర ప్రభుత్వం తలవంచక తప్పదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1055వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన ఎస్ఎంఎస్-2 విభాగ కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు అమ్మాలనే ఆలోచన వచ్చిన మోదీ ప్రభుత్వానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్తారన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేయడం సరికాదన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగుతుందని వెంటనే ప్రకటన చేయాలని, లేదంటే ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు.